క్యాలెండర్ ఆవిష్కరణ

మెహిదీపట్నం, జనవరి 14: కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్‌మిల్ ఇందిరానగర్ వద్ద ఉన్న తిరుపల్లి గడ్డ శ్రీకోవెల రంగనాయక స్వామి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆలయం ఆవరణలో లంగర్‌హౌస్ సంగం రామచంద్రజీ మఠం అధిపతి రాహుల్‌దాస్ బాబా ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ ప్రతినిధులు జనార్దన్,నర్సింగ్ రావు, గుంటి విజయ్ బాబు,కోయల్ కార్ శ్రీనివాస్, ఎన్.శ్రీకాంత్,జగన్నాథం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అబిడ్స్, జనవరి 14 : కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయవంతం కావాలని చారిత్రక భాగ్యలక్ష్మి ఆలయంలో చార్మినార్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.వెంకటేష్ పూజలు చేసి ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.సురేశ్ బాబు, జి.శ్రీనివాస్, వై.నందకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న జాతర



మల్లన్న ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, మాజీ చైర్మన్ ఊర్మిలా అంజిరెడ్డి

● హాజరైన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కవాడిగూడ, జనవరి 14: సంక్రాంతి సందర్భంగా భోలక్‌పూర్‌లోని బాకారంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో (మల్లన్న) ఆదివారం మల్లన్న జాతర మహోత్సవాలు అంగరంగ ప్రారంభమయ్యాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి ఊర్మిలా అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఒగ్గు పూజారి బాబురావు సమక్షంలో జాతర ప్రారంభించారు. ఉదయం 4 గంటల నుంచి స్వామివారి ఎదుర్కోలు, ఆలయం వెనుక నుంచి సాగర్‌లాల్ దవాఖాన, భరణి ఆయిల్ డిపో, కుమ్మరి సంఘం, వెస్లీ చర్చి నుంచి కట్టెలమండి గల్లీ, కేర్ దవాఖాన మీదుగా గంగ తెప్ప ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మల్లన్నను దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గసభ్యుడు పూసరాజు హాజరై మల్లన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ, కృష్ణ, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు రామానంద రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న భక్తులు

న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అంబర్‌పేట వంజరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గోల్నాక, జనవరి 14 : అంబర్ పేట వంజరి సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు లవంగు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దొరె గంగరాజు, కోశాధికారి వారె బాలకృష్ణ, కార్యనిర్వహక అధ్యక్షులు వంజరి నాగరాజు ఆధ్వర్యంలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేశ్, కోశాధికారి కాలేరు అమరేందర్, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వంజరుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వంజరి సంఘం ప్రతినిధులు భూమయ్య, మల్లేశం, నర్సింహ, నర్సింగ్‌రావు, అశోక్, శ్రీనివాస్, చంద్రశేఖర్, వీరేశం, యాదగిరి, ఎంకె రాజు, కృష్ణ, కాళిదాస్, వెంకటేశ్, కిశోర్, మధు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు

అహ్మద్‌నగర్ డివిజన్ ఫస్ట్‌లాన్సర్‌లో అజ్మీర్ దర్గా ఉర్సును పురస్కరించుకుని ఆదివారం కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేను సన్మానించారు.

– మెహిదీపట్నం, జనవరి14

ఎగ్జిబిషన్ మైదానంలో సంక్రాంతి సంబురాలు

అబిడ్స్, జనవరి 14 : తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు చాటేందుకు సంక్రాంతి సంబురాలు దోహదపడతాయని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్, జాయింట్ సెక్రటరీ చంద్రజిత్ సింగ్ పేర్కొన్నారు. శనివారం ఎగ్జిబిషన్ మైదానంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాలను ప్రారంభించారు.

బీసీ రిజర్వేషన్ల పెంపునకు తక్షణమే చర్యలు చేపట్టాలి

కాచిగూడ,జనవరి 14: పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా బీసీల డిమాండ్లను అమలు చేయాలని కోరారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 40 శాతం వరకు పెంచాలని, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సురేశ్, పండరినాథ్ పాల్గొన్నారు.

నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

రవీంద్రభారతి, జనవరి14 : రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుంది..

కాచిగూడ, జనవరి 14 : బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

సీతారాంబాగ్‌లో ప్రత్యేక పూజలు

అబిడ్స్, జనవరి 14 : ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరంలో స్వామి వారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సీతారాంబాగ్ ఆలయంలో శ్రీ సీతారామ్ మహారాజ్ సంస్థాన్, దేవాలయ రక్షణ సమితి ఆధ్వర్యంలో శ్రీరామ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ రక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కంభలేకర్ సందీప్ కుమార్ వెల్లడించారు. మల్లెపల్లిలో సందీప్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. భక్తులు సీతారాంబాగ్ ఆలయానికి వచ్చి శ్రీరాముని కోసం దీపం వెలిగించి అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొని రాముడిని పూజించి, హనుమాన్ ఆశీస్సులు పొందాలని కోరారు. ఉత్తరాఖండ్, హిమాలయాలు శ్రీవైష్ణవ గంగోత్రి మఠం, గంగోత్రి ధామ్‌కు చెందిన కమలేశ్ ఆచార్యజీ మహంత్, ఆచార్య గంగోత్రి రామానుజ దాస్‌జీ సమక్షంలో 22న ఉదయం 7 : 30 గంటలకు పూజలు ఉంటాయని తెలిపారు.

గుంతకల్ రైల్లో దొంగతనం

కాచిగూడ, జనవరి 14 : గుంతకల్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్, కుల్కచర్లకు వాసి కృష్ణయ్య భార్య గొల్ల విజయలక్ష్మి మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో బోధన్ –గుంతకల్ రైలెక్కి మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బ్యాగును చూసుకోగా.. రెండున్నర తులాల బంగారు ఆభరణాలు కన్పించలేదు. ఆమె ఆదివారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మక్సూద్ తెలిపారు.

ప్లాట్‌ఫారంపై వృద్ధుడు మృతి

కాచిగూడ,జనవరి 14: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65) శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–2 చివర్లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై నీలి రంగు చొక్క, గోధుమ రంగు లుంగీ ఉన్నదని, ఎత్తు 5.4 ఉన్నట్లు పేర్కొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుండా నడుపరాదు

చిక్కడపల్లి, జనవరి14 : వాహనాలకు నంబర్‌ప్లేట్ లేకుండా నడిసితే వారి కేసులు నమోదు చేస్తామని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. ఆదివారం సీఐ వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చైనా మాంజా విక్రయం.. అరెస్ట్

అబిడ్స్, జనవరి 14: ధూల్‌పేటలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మంగళ్‌హాట్ పోలీసులతో కలిసి మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మాంజా దుకాణదారులపై కేసులు నమోదుచేసి వారినుంచి భారీ మొత్తంలో నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు. పలు దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

చిక్కడపల్లి, జనవరి14 : పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. సురభి పార్కులో ఆదివారం బోర్‌వెల్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకుడు ఎ.వినయ్‌కుమార్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, నర్సింహ, సాయి కుమార్ పాల్గొన్నారు.

ఎల్ ఈడీ బల్బులతో విద్యుత్ ఆదా

కాచిగూడ,జనవరి 14 : ఎల్ఈడీ బల్బులతో విద్యుత్ ఆదా అవుతుందని కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. ఆదివారం లింగంపల్లి, భూమన్నలైన్ ప్రాంతాల్లో ఎల్ఈడీ బల్బులను కార్పొరేటర్ ఏర్పాటు చేయించారు.

సంక్రాంతి సంబురాలు

చిక్కడపల్లి, జనవరి14 : చిక్కడపల్లిలోని సెంట్ ఆడమ్స్ స్కూల్, న్యూ ఎరా కళాశాలలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులను ధరించి రంగవల్లులు, భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రవణ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

● చాంద్రాయణగుట్ట, జనవరి 14 : సంక్రాంతి మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ. మొదటి రోజు ఆదివారం భోగి మంటలతో పండుగ ప్రారంభం కాగా.. ఇండ్ల ఎదుట తీరొక్క ముగ్గులను వేసి గొబ్బెమ్మలులను పెట్టారు. చార్మినార్, శాలిబండ, బేలా కాలనీ, లాల్‌దర్వాజ, అలియాబాద్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ, గౌలిపుర, లలితాబాగ్ ప్రాంతాల్లో గాలి పటాలు, మంజాలను కొనుగోలు చేసి ఖాళీ ప్రదేశాలు, మైదానాలు, ఇంటి దాబాలపై ఎగురవేశారు.

● గోల్నాక, జనవరి 14 : అంబర్‌పేటలో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. చిన్నా పెద్దా కలసి పతంగులు ఎగరవేస్తూ సరదాగా గడుపుతున్నారు. ఆదివారం నల్లకుంటలోని తన నివాసంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలసి పతంగులు ఎగుర వేస్తూ సందడి చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

● అబిడ్స్, జనవరి 15 : భోగి సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మహిళలు తమ నివాసాల ఎదుట ముగ్గులు వేశారు. యువకులు గాలి పటాలు ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు.

● సంక్రాంతి సందర్భంగా పతంగుల దుకాణాల్లో రద్దీ పెరిగింది. ధూల్‌పేట, బేగంబజార్, మంగళ్‌హాట్, సుల్తాన్‌బజార్ ప్రాంతాల్లోని దుకాణాల్లో పతంగులు, మాంజాల విక్రయాలు చోటు చేసుకున్నాయి. గాలి పటాలతో పాటు మాంజాల ధరలను వ్యాపారులు పెంచి విక్రయించారు. రకరకాల డిజైన్లలో తయారు చేసిన పతంగులను యువకులు పోటీ పడి కొనుగోలు చేశారు.

● కాచిగూడ, జనవరి 14: పర్యావరణ పరిరక్షణకు కాగితం పతంగులనే ఉపయోగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు జీఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం భోగి మంటలు నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పతంగులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అమృతారెడ్డి, ఘనసంతోషిణి రెడ్డి, యోగిని, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పతంగులతో సందడి చేస్తున్న జీఎస్.గోపాల్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు



అఖిల భారత భారత కాంగ్రెస్ భారత్ జోడోయాత్ర నేపథ్యంలో ఢిల్లీలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీని తెలంగాణ తొలగించిన 26 కులాల చైర్మన్ ఆళ్ల రామకృష్ణ ఆదివారం కలిసి తెలంగాణలో కులగణన చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.

– రవీంద్రభారతి, జనవరి14

ఆలయాల్లో స్వచ్ఛత

చిక్కడపల్లి, జనవరి14 : గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో రాజ్యాసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్‌తో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా దేవాలయాన్ని శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకుడు ఎ.వినయ్‌కుమార్, రమేశ్ రామ్, రత్నసాయిచంద శ్రీకాంత్, ఆకుల సురేందర్, స్వామిరెడ్డి, మహమూద్, సురేశ్,నర్సింహ, ఆనంద్ రావు పాల్గొన్నారు.

21న తిరుమల మహాపాదయాత్ర ప్రారంభం

మహాపాదయాత్ర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అరుంధతి రంగాచార్యులు, బడేసాబ్

లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గడపగడపకు గీత, గోవిందుడు, గోవు'నినాదంతో శ్రీవారి తిరుమల మహాపాదయాత్ర ఈ నెల 21 నుంచి కూకట్‌పల్లి నుంచి ప్రారంభిస్తున్నామని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గట్టు అరుంధతి రంగాచార్యులు, ఫౌండేషన్ చైర్మన్ రాజు, అచ్యుతరావు, ప్రభాకర్‌జీ, పి.బడేసాబ్, శిల్పారెడ్డి తెలిపారు. 40 రోజుల పాటు కొనసాగి మార్చి 3వ తేదీ నాటికి తిరుమల చేరుకుంటుందన్నారు

– రవీంద్రభారతి, జనవరి14

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మెహిదీపట్నం, జనవరి 14: టోలిచౌకికి చెందిన మహ్మద్ రహ్మాన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్‌లో మంజూరైన రూ.27 వేల చెక్కు ఆదివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ టోలిచౌకిలోని కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడానికి కృషి చేస్తున్నామన్నారు.

కన్నుల పండువగా గోదా రంగనాథ స్వామి కల్యాణం

ముషీరాబాద్, జనవరి 14 : రాంనగర్ రామాలయంలో ధనుర్మాస ప్రతమహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అంతకు ముందు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి పూజలు, అర్చనలు, హోమం నిర్వహించారు. ఈ వేడుకల్లో అడిక్‌మెట్ కార్పొరేటర్ సి.సునీతగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, రామాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ రవి యాదవ్, కార్యనిర్వాహణ అధికారి పి.లక్ష్మారెడ్డి పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని శేష వాహనంపై ఊరేగించారు.

సీవరేజీ లైన్ మరమ్మతులు

అబిడ్స్, జనవరి 14: నాంపల్లి నియోజకవర్గంలో సీవరేజీ లైన్ మరమతులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్, ఎంఐఎం మల్లేపల్లి కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి దారుస్సలాం రోడ్డులో కూలిపోయిన సీవరేజీ లైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో జల మండలి ఉన్నతాధికారులతో చర్చించి పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పామని తెలిపారు.